# బీసీల గొంతుకగా ఉంటా

■ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గౌడ సంఘాల నేతలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 15. బడుగు బలహీనవర్గాల గొంతుకగా ఎప్పటికీ ఉంటానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ గౌడ సంఘం, పీసీసీ కల్లుగీత సెల్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్‌ను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం గౌడ సంఘాల నాయకులు ఆత్మీయ సత్కారం చేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఐకమత్యంతో ఉంటే బీసీలు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ముఖ్యంగా బీసీ కులగణన, జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, మాజీ ఎమ్మెల్యే రాజలింగం, గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శంబుల శ్రీకాంత్‌గౌడ్, గౌడ సంఘం కోశాధికారి హరిచరణ్‌గౌడ్ పాల్గొన్నారు.



దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

# దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

పాపన్నపేట, డిసెంబర్ 15: ఏడుపాయల వనదుర్గా భవానీమాతను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి సునీతాలక్ష్మారెడ్డి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, ధర్మకర్తలు మనోహర్, మోహన్‌రావు, యాదవ్‌గౌడ్, బాగారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

■ బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 15: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందంపేటలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మతల్లి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించున్నారు. పద్మాదేవేందర్‌రెడ్డిని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు, లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, కుమార్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాయకులు హేమావెంకటేశం, సుధాకర్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓటు నమోదుకు మరో ఛాన్స్

ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల

■ 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండే వారికి ఓటు హక్కు
■ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా చర్యలు
■ ఈ నెల 20 నుంచి మార్పులు, చేర్పులకు అవకాశం
■ ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఇటీవల కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశమిచ్చింది. త్వరలోనే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల ప్రక్రియ నమోదుకు మరోసారి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రకారం 18 ఏండ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు మార్పులు, చేర్పులు చేపట్టనున్నది. ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. *- సిద్దిపేట రూరల్, డిసెంబర్ 15*

### 18 ఏండ్లు నిండిన వారికి అవకాశం

జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండేవారు కొత్తగా ఓటు నమోదుకు అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. త్వరలోనే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, పురపాలికలతో పాటు లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. దాంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏండ్లు నిండే వారు ఓటురుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఓటర్ల నమోదుతోపాటు బోగస్ ఓట్ల తొలగింపు, చిరునామా మార్పు చేసుకోవచ్చు. ఇలా రూపొందించిన ఓటర్ల జాబితా తుది ప్రక్రియను ఫిబ్రవరి 8 నాటికి పూర్తి చేయనున్నది. ఓటు నమోదు కోసం బీఎల్‌ఓలతోపాటు ఆన్‌లైన్‌లోనూ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ క్రమంలో 18 ఏండ్లు నిండిన యువత పేర్లు సేకరించేందుకు బీఎల్‌ఓలు ఇంటింటినీ సందర్శిస్తారు. కొత్తగా ఫారం-6 పూర్తిచేసి అందజేస్తే బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డు చిరునామా, తప్పుల సవరణకూ ఇందులో అవకాశం ఉంటుంది. ఓటరు జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరించనున్నారు. ఓటరు జాబితా సరవణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో అధికారులు ఓటరు సవరణను పర్యవేక్షించనున్నారు. ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతంలో చేపట్టిన విధంగానే బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

### శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

అర్హులైన యువత ఓటు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు యువత కళాశాలల్లోనే దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించనున్నారు. ఇందుకుగాను షెడ్యూల్ వ్యవధిలో ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. కొత్తవారి నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారు.

### షెడ్యూల్ ఇలా..

- జనవరి5 వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులకు అవకాశం.
- జనవరి 6న ఓటరు జాబితా ముసాయిదా ప్రకటన.
- జనవరి22 వరకు అభ్యంతరాల స్వీకరణ.
- జనవరి22 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఏదో ఒక శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ.
- ఫిబ్రవరి 2న అభ్యంతరాల పరిశీలన.
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన.

### ఏ ఫారం ఎందుకోసం?

- **ఫారం-6 :** కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం-6ను ఉపయోగించాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు(లేకుంటే నివాస ధ్రువీకరణ పత్రం) జతపర్చాలి.
- **ఫారం-6ఏ :** ఎన్‌ఆర్‌ఐలు ఫారం-6ఏను ఉపయోగించాలి. ఇందుకు తాము నివాసముంటున్న దేశంలో సిటిజన్ షిప్ లేదని, అక్కడి అంబాసిడర్‌తో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- **ఫారం-7 :** ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం-7ను ఉపయోగించాలి. విచారించిన తర్వాత పేర్లు తొలగిస్తారు.
- **ఫారం-8 :** పేరు, పుట్టిన తేదీల్లో తప్పులను సవరించేందుకు ఫారం-8ను ఉపయోగించాలి. ఈ ఫారానికి సరి చేయాల్సిన పేరుకు సంబంధించిన డిక్లరేషన్, 10వ తరగతి మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒకటి జతపర్చాలి.
- **ఫారం-8ఏ :** చిరునామా మార్చేందుకు ఫారం-8ఏను ఉపయోగించాలి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు పూర్వ చిరునామాతో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తే సరిపోతుంది.



### సద్వినియోగం చేసుకోవాలి..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది పేర్లు గల్లంతు కావడం, జాబితాలో తప్పులు దొర్లడం, కుటుంబంలోనే ఒకరికి ఓ పోలింగ్ బూత్‌లో, మరొకరికి మరో బూత్‌లో పేరు రావడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. కొంత మంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాబితాలో పేర్లు లేనివారు, చిరునామా తప్పుగా ఉన్నవారు పోలింగ్ బూత్ మార్చుకోవాలన్నా సవరణకు అవకాశం ఉంది. ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



# పత్తి కొనుగోళ్ల జోరు

## తెల్లబంగారంతో నిండిన గజ్వేల్ ఏఎంసీ



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన పత్తి

■ గజ్వేల్, ములుగు డివిజన్లలో 50,028 ఎకరాల్లో పత్తిసాగు
■ గతేడాది గజ్వేల్ మార్కెట్‌లో లక్షా50వేల క్వింటాళ్ల పత్తి సేకరణ
■ ఈ ఏడాది 3,50,196 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం
■ సీసీఐ కొనుగోలు కేంద్రాలతో గజ్వేల్ ఏఎంసీకి పెరుగుతున్న ఆదాయం

గజ్వేల్‌అర్బన్, డిసెంబర్ 15: పత్తి కొనుగోళ్లలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ దూసుకుపోతున్నది. గతేడాది కంటే ఈసారి రెట్టింపు పత్తి విక్రయాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం మార్కెట్‌లో పత్తికి మంచి ధర వచ్చింది. కానీ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్‌గా విక్రయించారు. ఈ ఏడాది ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7020మద్దతు ధర ప్రకటించగా సీసీఐ కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబర్ 24 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా క్వింటాల్ పత్తికి రూ.7వేల నుంచి అత్యధికంగా రూ.8300ల వరకు ధర పలికింది. గతేడాది డిసెంబర్ 14 నాటికి 38 వేల క్వింటాళ్లకు పైగా పత్తి విక్రయాలు జరుగగా మొత్తం గజ్వేల్ మార్కెట్ యార్డు, జిన్నింగ్ మిల్లులో కలిసి లక్షా50వేల క్వింటాళ్లకు పైగా పత్తి విక్రయాలు జరిగాయి. ఈ సంవత్సరం అక్టోబర్ 10వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా మద్దతు ధర రూ.7020 ఉండగా, తేమ శాతాన్ని బట్టి సీసీఐ, జిన్నింగ్ మిల్లులు, ట్రేడర్స్ రైతులకు డబ్బులు చెల్లిస్తున్నాయి. ఇప్పటివరకు మార్కెట్‌యార్డులో ట్రేడర్స్ సీసీఐ కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లులు 8109 మంది రైతుల నుంచి 66వేల క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోలు చేశాయి.

**గతేడాది కంటే రెట్టింపు పత్తి విక్రయాలు**

### గజ్వేల్, ములుగు డివిజన్లలో 50,028 ఎకరాల్లో పత్తిసాగు

గజ్వేల్, ములుగు వ్యవసాయ డివిజన్‌న్లలో మొత్తం 50,028 ఎకరాల్లో పత్తిసాగైనట్లు ఏడీఏలు బాబునాయక్, అనిల్ తెలిపారు. గజ్వేల్ డివిజన్‌లోని గజ్వేల్ మండలంలో 14459 ఎకరాలు, కొండపాకలో 6206, రాయపోల్‌లో 5811ఎకరాల్లో పత్తి సాగు కాగా మొత్తం 26,476ఎకరాల్లో పత్తి సాగైంది. ములుగు డివిజన్‌లోని జగదేవ్‌పూర్ మండలంలో 15818.23, మర్కూక్‌లో 3880, ములుగులో 1151.31, వర్గల్‌లో 2671.35 ఎకరాల్లో పత్తిసాగు కాగా ములుగు డివిజన్‌లో మొత్తం 23522.09 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. గజ్వేల్, ములుగు డివిజన్లలో కలిసి మొత్తం 50,028ఎకరాల్లో పత్తి సాగు కాగా 3,50,196క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

### గతేడాది కంటే మరో లక్ష క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం



గతేడాది గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో జరిగిన విక్రయాల కంటే రెట్టింపుగా ఈ ఏడాది పత్తి విక్రయాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గజ్వేల్ ప్రాంతంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వల్ల విక్రయాలు పెరిగినట్లు భావిస్తున్నాం. ఇప్పటి వరకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల నుంచి 467 క్వింటాళ్ల పత్తిని ట్రేడర్లు కొనుగోలు చేయగా, జిన్నింగ్ మిల్లులు 34,180 క్వింటాళ్ల పత్తిని, సీసీఐ 31,496 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశాయి. గతేడాది ఈ సమయానికి వచ్చిన పత్తి కంటే ఈ సంవత్సరం రెట్టింపుగా పత్తి మార్కెట్‌లో కొనుగోలుకు రావడం ఎంతో సంతృప్తినిస్తుంది. గతేడాది గజ్వేల్ మార్కెట్‌లో లక్షా50వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరుగగా, మా అంచనాల ప్రకారం ఈ ఏడాది గజ్వేల్ మార్కెట్‌లో 2,50,000 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది. రైతులకు, సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వహణకు, అధికారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. దీనివల్ల రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఈసారి రైతులకు డబ్బుల చెల్లింపుల్లో ఎలాంటి మోసాలు జరుగకుండా బ్యాంకు ఖాతాకు, ఫోన్ నంబరుకు ఆధార్‌ను అనుసంధానం చేసింది. ఈ విషయాన్ని రైతులకు మా సిబ్బంది ముందే వివరించడంతో ఎలాంటి సమస్యలు తలెత్తడం లేదు. వీలైనంత త్వరగా రైతులకు డబ్బులు చెల్లింపులు జరుగుతున్నాయి.

*– జాన్‌వెస్లీ, ఏఎంసీ కార్యదర్శి, గజ్వేల్*

# వైకల్యాన్ని జయించాలి

■ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి
■ ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
■ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
■ మెదక్ పట్టణంలో దివ్యాంగుల ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ రూరల్, డిసెంబర్ 15: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళాశిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ధ్యాన్‌చంద్ విగ్రహం (బోధన్ చౌరస్తా) నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగుల ర్యాలీని జిల్లా అధికారి బ్రహ్మాజీ ప్రారంభించారు. అనంతరం స్టేడియంలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. దివ్యాంగులు వికలాంగత్వాన్ని జయించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చూసుకోవాలని సూచించారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ దివ్యాంగులు సకలాంగులతో సమానమన్నారు. దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన విషయాలపై దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. దేవుడు అపారమైన శక్తి ఇచ్చాడని, ఎవరేమనుకున్నా లక్ష్యసాధన దిశగా ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేస్తే విజయం వరిస్తుందన్నారు. జిల్లాలో 12,796 మంది దివ్యాంగులు ఉన్నారని, వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ వీల్‌చైర్లు, చంకకర్రలు, వినికిడి యంత్రాలు, డైసీ ప్లేయర్, స్మార్ట్‌ఫోన్లు అందిస్తున్నామన్నారు. వివాహ ప్రోత్సాహకాలు, పింఛన్లు, బ్యాంకు రుణాలు, రాయితీ బస్సుపాసు సౌక్యారాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పరుగుపందెం, షాట్‌పుట్, జావెలింగ్ త్రో, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి స్థానంలో 22, ద్వితీయ స్థానంలో 16, తృతీయ స్థానంలో 6 మంది నిలిచారు. వీరికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో వెంకటరమణమ్మ, ఈవోలు పద్మాలత, రవీందర్, ఐసీపీఎస్, ఎంఎస్‌కే, పీహెచ్‌ఎల్, సఖీ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్‌అఫెర్స్ డైరెక్టర్ పౌసుమిబసు

# భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి

■ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్‌అఫెర్స్ డైరెక్టర్ పౌసుమి బసు
■ సంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 15: సంగారెడ్డి జిల్లాలో విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్‌అఫెర్స్ డైరెక్టర్ పౌసుమిబసు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో విక్‌సిత్ యాత్రపై పౌసుమి బసు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు గ్రాస్ రూట్ లెవెల్ చేరుకోవాలన్నదే విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాకు 10 ప్రచారరథాలను కేటాయించారని, ఆయా వాహనాల్లో పీఎం మెసేజ్ ఆడియో, వీడియోతో ఉంటుందన్నారు. ఈనెల 16 నుంచి వచ్చే నెల 25 వరకు ఒక్కో వాహనం రెండు గ్రామ పంచాయతీలకు వెళ్తుందన్నారు. ఆ దిశగా ప్రణాళిక చేసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ శరత్ మాట్లాడూతూ విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా జిల్లాకు 10 మొబైల్ వ్యాన్లు వచ్చాయని తెలిపారు. షెడ్యూలు మేరకు ప్రతి వాహనం ప్రతిరోజూ రెండు గ్రామ పంచాయతీలను కవర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో నగేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీవోలు పాల్గొన్నారు.



విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్ర రథాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ పౌసుమి బసు

# కేంద్ర పథకాలను అర్హులకు అందించాలి

■ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పౌసుమి బసు
■ మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరక్టర్ పౌసుమి బసు

మెదక్ అర్బన్, డిసెంబర్ 15: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పౌసుమి బసు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులతో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై పౌసుమి బసు జిల్లా కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలైన ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై, పీఎం గరీబ్ కళ్యాన్ అన్నా యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్ పీఎం పోషణ్ అభియాన్, హర్ ఘర్ జల్-జల్ జీవన్ మిషన్ తదితర పథకాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అవగాహన కల్పించడంతో పాటు ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే వారు తమ పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార రథాలను ఈనెల 16వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలపారు. జిల్లాకు 10 ప్రచార రథాలు కేటాయించారని అట్టి వాహనాల్లో ప్రధానమంత్రి మెసేజ్ ఆడియో, వీడియోలతో ఉంటుందన్నారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల జనవరి 25 వరకు ప్రతి రోజూ ఒక్కో వాహనం రెండు గ్రామ పంచాయతీలకు వెళ్తుందన్నారు. అందుకు రూట్ మ్యాప్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రజలు అట్టి క్యాంపులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం మూర్తి, డీఎంఅండ్‌హెచ్‌ఓ చందునాయక్, డీఏఓ గోవింద్, డీఇఓ రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.